ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకా దేవి పురాణము

## ద్వితీయాధ్యాయము

### ధర్మనందనోపాఖ్యానము :-

వైశ్యవంశగాథా శ్రవణాసుక్తులైయుండిన శౌనకాది మహామునులను జూచి సూతుడు "ఓ మునిసత్తములారా! పూర్వము బుద్ధికుశలుడైన ధర్మనందనునకు ఆదిశేషునిచే చెప్పబడిన పావనచరిత్రను నారదుడు నాకు ఏకాంతముగ వినిపించెను. ఆ గాథను నేనిప్పుడు మీకు తెలియజేసెదను. సావధానులై వినుడు" అని యిట్లు చెప్పనారంభించెను.

పరమపవిత్రమైన ఆర్యావర్తమునందు శ్రేష్ఠమై ప్రతిష్ఠనందిన ప్రతిష్ఠా నగరమను మహానగరము కలదు. అందు చూడామణి యనుపేరుగల వైశ్యోత్తముడొకడు నివసించుచుండెను. అతడు జ్ఞానవంతుడు, గుణవంతుడు, శీలవంతుడు, సత్యసంధుడు, నిత్యదానధర్మాది సద్గుణనిబద్ధుడు, ధర్మతత్పరుడునై యుండెను. అతడు తన నిరుపమాన ధర్మనిరతిచే ధర్మశ్రేష్ఠియను విఖ్యాత నామము పొందెను. ఆ మహానీయుడు సమస్త సంపదలతో తులదూగుచుండినను సంతానము లేనందున మిక్కిలి సంతాపము చెంది, ధర్మపత్నీ సమేతుడై చ్యవన మహర్షి ఆశ్రమమునకు పోయెను. మహర్షిని విద్యుక్తముగ పూజించి "ఓ ఋషిసత్తమా! నాకెన్ని భోగభాగ్యములున్నను, సంతానము లేదను కోరిక సదా నన్ను పీడించుచున్నది. "అపుత్రస్య

గతిర్నాస్తి" యను ఆర్యోక్తి తలపునకు వచ్చినప్పుడెల్ల నామది విలవిలలాడుచున్నది. తరుణోపాయమునకై తమ చరణారవిందముల నాశ్రయించితిని. పుత్రహీనుడనైన నాకు సంతాన ప్రాప్తి కలుగు ఉపాయమును దయతో ఉపదేశింపుడు" అని ప్రార్థించెను. అపుడాచ్యవన మహర్షి ధర్మశ్రేష్ఠిని జూచి ఓ వైశ్యోత్తమా! భక్తుల సమస్త వాంఛితములను యీడేర్చగల ఆదిపరాశక్తిని గూర్చి నిశ్చలచిత్తుడవై, సతీసమేతుడవై తపస్సు చేయుము. ఆదేవీ కృపవలన నీకు తప్పక పుత్రసంతానము ప్రాప్తించగలదు అని చెప్పి, ఆ వైశ్యవరునకు దేవీ దివ్యమంత్రము నుపదేశించెను. మంత్రోపదేశమునందిన శ్రేష్ఠ దంపతులు మహానందభరితులై నిరుపమాన నిష్ఠాగరిష్ఠులై అచంచల దీక్షతో తపమాచరించిరి. వారి అమోఘ తపః ప్రభావమున ముల్లోకములు కంపించినవి. లోకరక్షకియైన పరమేశ్వరి కరుణించినది. ధర్మశ్రేష్ఠి దంపతులయెదుట సాక్షాత్కరించినది. వారికి పుత్రసంతానదాయకమ్మైన వరమును ప్రసాదించినది. అటుపిమ్మట నొక సంవత్సరకాలము నిండగనే, ధర్మశ్రేష్ఠి భార్యయైన "ఆర్యక" తేజోనిధియగు యొక కుమారుని ప్రసవించినది. ఆ బిడ్డడు తన ధర్మనిరతి చేతను, త్యాగగరిమ వలనను జగద్విఖ్యాతుడు కాగలడని జ్యోతిష్యులు పలికిరి. ఆ పిల్లవానికి ధర్మనందనుడను పేరు పెట్టబడెను. ధర్మనందనుడు శుక్లపక్షచంద్రుని వలె దినదినాభివృద్ధి నందెను. ఎనిమిదేండ్ల ప్రాయము వచ్చినతోడనే తండ్రియగు ధర్మశ్రేష్ఠి ఆ బాలునకు ఉపనయన సంస్కారములు జరిపించెను. అటుపై ఋతము, అధ్యయనము, సత్యభాషణము, సత్యాచరణము, తపస్సంపద, బాహ్యాంతరేంద్రియ నిగ్రహము అనెడు శమదమాది సద్గుణముల గలిగినవాడును ఆగ్న్యారాధనము, యజ్ఞాచరణము, అతిథిపూజనము, దయ, కరుణ, మైత్రి, నమ్రత, వినయము, శ్రద్ధ మున్నగు శుభగుణములచే శోభిల్లువాడును, గృహస్థాశ్రమ ధర్మనిర్వహణ దీక్షాదక్షుడునూ ఆదర్శ గురు లక్షణములతో విరాజిల్లుచుండిన భార్గవ చ్యవనుని గురుకులా శ్రమమునకు ధర్మశ్రేష్ఠితన కుమారునిగొనిపోయెను. అట ఆ మహర్షిచే

ధర్మనందుడునకు వేదారంభ సంస్కారము చేయించి, విద్యాభ్యాసమునకై ఆ బాలుని గురుకులమున చేర్పించెను. అంతట ఆ చ్యవన మహర్షి ధర్మనందనునకు విద్యారంభ కాలమున గురువు శిష్యునకు బోధించవలసిన హితవాక్యములను ఆశ్రమనియమములను మరియు బ్రహ్మచర్యవ్రతాచరణ విధానములను చక్కగా తెలియజేసి విద్యాబోధన నారంభించెను.

ధర్మనందనుడు అత్యంత శ్రద్ధా భక్తులతో గురు సేవగావించుచు అనతి కాలముననే వేదవేదాంగములను అభ్యసించి ఆదర్శ శిష్యుడనిపించుకొనెను. అంత చ్యవన మహర్షి ధర్మనందనునితో "నాయనా! నీకు నేర్పవలసిన విద్యలన్నింటిని నేర్పితిని ఇంక కొలది దినములలోనే నీవు స్వగృహమునకు పోవనగును. నీవు నీ జీవితమున నిర్వర్తింపవలసిన విధులను గూర్చి చివరి బోధగ తెలుపుచున్నాను, సమాహిత చిత్తుడవై వినుము." అని యిట్లు చెప్పసాగెను.

"కుమారా! సదాసత్యమునే పలుకుము. ధర్మమునే ఆచరించుము. స్వాధ్యాయమును నిర్లక్ష్యము చేయవలదు. ఆచార్యునకు ప్రీతికరములైన కాన్కలను తెచ్చి దక్షిణగ సమర్పింపుము. సద్గృహస్తుడవై సత్సంతానమును పొంది వంశము నిల్పుము. ఆత్మ సంరక్షణాది కుశలముల నుండి తొలగవలదు. ధర్మయుతమైన న్యాయమైన మార్గమున నీ సంపదల అభివృద్ధి చేసుకొనుటలో అశ్రద్ధ జూపవలదు. మరియు ఆ సంపదలతో లోకకళ్యాణ కారకములైన కార్యములను చేయుటలో అశ్రద్ధ జూపవలదు. స్వాధ్యాయము - ప్రవచనము యీ రెండింటిని నిర్లక్ష్యము చేయవలదు. తల్లిని తండ్రిని ఆచార్యుని అతిథిని దైవస్వరూపములుగ భావించి సేవింపుము. నింద్య కార్యములను విడిచి, అనింద్యములైన పనులనే ఆచరింపుము. మాచే చేయబడిన కార్యములలో మంచి వానిని మాత్రమే నీవును చేయుము. మాకంటే శ్రేష్టులైన వారెదురైనచో వారి నాహ్వానించి సేవింపుము.

నాయనా! ఆత్మసాక్షాత్కారమును పొంది, దుఃఖపూర్ణమగు సంసార సాగరమును తరించుటయే వేదముల సారము. కాని అందరి మనస్సులందు మంచికోర్కె మొదటినుండియే జనించదు కనుక సత్కర్మలతో సద్భావములతో ఎట్లు జీవించవలెనో వేదము విధినిషేధరూపమున తెల్పుచున్నది. శ్రుతి ప్రతిపాదితమైన విధముగ జీవించువారి హృదయములలో నిత్యానిత్యవివేకము, వైరాగ్యము, దైవసాక్షాత్కారవాంఛ క్రమముగ కలుగును. ప్రియమైన సత్యమును చెప్పుము. అప్రియమైనది సత్యమేయైనను పలుకవలదు, పొరపాటుననైనను అసత్యమాడకుము. పెద్దలు ప్రసంగించుచున్నప్పుడు నిశ్శబ్దముగ కూర్చుండి శ్రద్ధతో వినవలయును.


ఎవ్వరికైనను దానములిచ్చునపుడు దేశకాల పాత్రలను వివేచించి యథాశక్తి శ్రద్ధతో, వినయముతో, భయభక్తులతో, మిక్కిలి సంతోషముతో ప్రేమతో శుభాకాంక్షాపూర్వకముగ ఆయాదానముల నియ్యవలెను. అశ్రద్ధతో దానమీయరాదు.

శాస్త్రవిహితకర్మలనుగూర్చిగాని, ఆచారములను గూర్చిగాని సందేహములు కల్గినప్పుడు స్వతంత్రులు, దయాధర్మయుతులు, కర్మకుశలురు, బుద్ధిమంతులైన వారినాశ్రయించి నీకు సందేహము కల్గించిన కర్మాచారములను వారాచరించు విధమున ఆచరించవలయును. ఇక సమాజముచే దోషులుగ పరిగణింపబడినవారితో ఎట్లు ప్రవర్తింపవలెనో తెలియనపుడు పైన నుడివిన లక్షణములు గల పెద్దలు ఆ దోషులతో ఎట్లు ప్రవర్తింతురో గమనించి అట్లే నీవును ప్రవర్తింపుము.

నేనిప్పుడు చెప్పిన ఈ విషయములన్నింటిని దైవాజ్ఞగ, ఉపదేశముగ, వేదసారముగ మరియు కర్తవ్యముగ గ్రహించి ఆచరించి ధన్యజీవనుడవు గమ్ము. ఈ విషయములు తైత్తరీయోపనిషత్తు నందు తెలుపబడిన వేదోపదేశములు సుమా" అని చివరి ఉపదేశము గావించి చ్యవన మహర్షి ధర్మనందనుని సమావర్తన సంస్కారమునకై కావలసిన ఏర్పాట్లుగావించసాగెను.

మరునాటి ఉదయమున ధర్మనందనుడు యధావిధిగ పుష్పములు సమిధలు తెచ్చుటకై వనమునకు పోయి, అక్కడి మనోహర ప్రకృతి నవలోకించుచు, పుష్పములకై అన్వేషించుచు తిరుగాడు చుండగ, వానికొక ఆర్తనాదము వినిపించెను. ధర్మనందుడాధ్వనిచే ఆకర్షింపబడి అటువైపునకు చెవియొగ్గిన "ఓ వ్యాధుడా! నేను తీర్థయాత్రాసక్తుడనైన అంగీరసుడను బ్రాహ్మణుడను. సాధుజీవనుడను. నన్ను హింసింపకుము. విడిచిపెట్టుము." అను దీనాలాపములు వినిపించినవి. అంత అతడాశబ్దము ననుసరించి బహుదూరము పోయిన తరువాత వింధ్యపర్వత సమీపమున ఒక కిరాత కాపాలికునిచే బాధింపబడుచుండిన యొక బ్రాహ్మణుని జూచి మిక్కిలి దుఃఖితుడై, ఆ కిరాతకునితో "ఓరీ పాపాత్ముడా! సాధుజీవనుడు పూజ్యుడునైన బ్రాహ్మణుని ఏల హింసించుచున్నావు?" అని యడుగగా ఆ మాటలు వినిన వ్యాధుడు కుపితుడై "ఓరీ బాలకా! నీవు కొంచెమైనను భయములేక మాట్లాడుచున్నావు. మరల మాట్లాడినచో నిన్ను గూడ హింసించెదను." అని భయపెట్టెను. ధర్మనందనుడు బెదరక "వ్యాధుడా! నిరపరాధియైన ఆ విప్రుని ఎందుకు చంపబూనుకొన్నావో తెలియజేయుము." అని ఒత్తిడిచేసెను. అపుడావ్యాధుడు "ఓ బాలకా! నేను ప్రతి సంవత్సరము ఈ వింధ్యగిరిలో నెలకొనియున్న శక్తికి యొక పురుషుని బలిగా అర్పించవలసి వున్నది. ఇది మా వంశాచారము. ఇదినా అవశ్యకర్తవ్యము." అని బదులు చెప్పెను. ఆ మాటలు వినిన ధర్మనందనుడు ఆ బ్రాహ్మణుని బంధము నుండి తొలగించి, ఆ పాశమును తన కంఠమునకు తగిలించుకొని, కిరాతకునితో "ఓయీ! బ్రాహ్మణునకు బదులుగ నన్ను శక్తికి బలియిమ్ము. నీ శ్రేయస్సును సంపాదించుకొనుము." అని దిటవుగ పలికెను. క్రూరుడైన ఆ వ్యాధుడు వెంటనే బ్రాహ్మణుని విడచి, ధర్మనందనుని బంధించి యీడ్చుకొని పోసాగెను.

కొనదేలిన కఠినకర్కశ శిలలతోను, ముళ్ళపొదలతోను దుర్గమముగ నున్న ఆ యడవిదారిలో యీడ్చుకొనిపోబడుచున్న బాలుని శరీరమంతయు గాయములై రక్తము



ధర్మనందనుని వాసుకి ఆదిశేషుని ఆస్థానమునకు తీసుకొనిపోవుట

స్రవించసాగెను. అది చూచి వ్యాధుడు వెటకారముగ "ఏమి బాలకా! కావరముతో బాపడిని విడిచిపెట్టించితివి ఇప్పుడు నీకీ సుఖమెట్లువున్నది?" అని యెకశక్య ములాడుచు, అణుమాత్రమైనను జాలిలేక, ఆ బాలుని మరింత వేగముతో యీడ్చుకొనిపోసాగెను. ధర్మనందనుడు ఆవంతైనను చలించక స్థిర చిత్తుడై వ్యాధుని వెంటపోసాగెను. వ్యాఘ్రభల్లూకాది భయంకర క్రూర మృగములతో గూడిన ఆ దుర్గమారణ్యమున ధర్మనందనుని తీసుకొని పోవుచున్న వ్యాధుడు త్వరత్వరగ నడచుచు ఒకచోట ఆకస్మికముగ ఆగెను. అతడు కొలది దూరమునుండి పెద్ద సైన్యము వచ్చుచున్నట్లు సూచించు ఒక భయంకర ధ్వనివినెను. ధూళిచే ఆవరింపబడిన ఆకాశమును చూచి తత్తరపాటునంది "అమ్మో! మహరాజు సైన్యసమేతుడై యీ మహారణ్యముకే వచ్చుచున్నాడు." "బాలుడా! మనమిక యిక్కడ నిలువరాదు. ఆ రాజు నన్ను తిలకించినచో తప్పక సంహరించును." అని పలుకుచు బాలుని బంధవిముక్తుని

గావించి, వాని చేయి పట్టుకొని త్వరత్వరగ పరుగెత్తి అక్కడ గలనొక పర్వత గుహలో వానిని పడవేసెను. అటుపై ఆ ధర్మనందనునితో ఓయీ బాలకా! నేను మరలివచ్చువరకు ఇచ్చటనే నిరీక్షించుచుండుము." అని ఆజ్ఞాపించెను. తరువాత సంశయాత్ముడైన ఆ కిరాతకుడు బిలద్వారమునొక పెద్ద బండతో మూసివేసి అటునుండిపోయి ఒక మహావృక్షమునధిరోహించి, కొమ్మలలో దాగియుండెను.

ఇంతలో భద్రుడను మగధ దేశాధిపతి సైన్యసమేతుడై ఆ అడవికి వేటకై వచ్చెను. వేటాడుచు అలసిన ఆ రాజు, విశ్రాంతికొరకై కిరాతుడధిరోహించిన చెట్టు క్రిందకేచేరెను. దైవ వశమున చెట్టుపై దాగియున్న కిరాతుడా రాజు కంటబడెను. "ఔరా! లోకకంటకుడైన కాపాలిక వ్యాధుడెవడో బాటసారులను చంపుకోర్కెతో, ఈ చెట్టుకొమ్మలలో దాగియున్నాడు. వీడు వధార్హుడు. వీనిని వెంటనే పట్టి వధించుడు." అని రాజు తన సైనికులను ఆజ్ఞాపించెను. ఆ కిరాతకుడు కాపాలికుడగుట వలన మంత్రతంత్రములతో మాయాయుద్ధము గావించెను. తుదకు భద్ర మహారాజు తీక్షణమైన అర్ధచంద్ర బాణమును ప్రయోగించి ఆ కిరాతకాపాలికుని శిరస్సును ఖండించివేసెను. పిమ్మట ఆ రాజు సంతుష్టాంతరంగుడై అచటనే కొంతతడవు విశ్రమించి నిజపురమునకు మరలిపోయెను.

## ధర్మనందనునకు ఆదిశేషుని సందర్శనము – జ్ఞానబోధ :-

ఇక్కడ యిట్లుండగ శంకరుని కంఠహారమగు వాసుకియను నాగరాజు పరమేశ్వరుని యనుజ్ఞబడసి, ఆదిశేషుని జూచుకాంక్షతో కైలాసమునుండి బయలుదేరి భూలోకమునకు చేరెను. అతడు పాతాళ బిలద్వారము వద్దకు వచ్చి, ఆ ద్వారమొక పెద్దబండచే మూయబడివుండుటను చూచి మహోగ్రుడై తీవ్రముగ పూత్కరించెను. తక్షణమే ఆ బండవేయి ముక్కలుగా పగిలిపోయెను. అనంతరమా గుహాంతర్భాగమున

దైవధ్యాన తత్పరుడైయున్న ధర్మనందనుని జూచి వాసుకి ఆశ్చర్యచకితుడయ్యెను. అతడు బాలుని ధ్యానసమాధి నుండి మేల్కొల్పెను. ధర్మనందనుడు కనులు తెరచి తన ఎదుట నున్న వాసుకిని గాంచి నమస్కరించి, పలు విధముల ఆ నాగరాజును సంస్తుతించెను. ఆ బాలుని వినయవిధేయతలకు మిక్కిలిగ సంతసించిన వాసుకి వానినాశీర్వదించి, 'ఓ కుమారా! ఇది నాగలోకమార్గము. నీవిక్కడ ధ్యాననిమగ్నునవై యుండుటకు గల కారణమేమిటి?" అని ప్రశ్నించగ వాసుకియొక్క ప్రేమమయ వాక్కులనాలించిన ధర్మనందనుడు తన వృత్తాంతమంతటిని నాగరాజునకు విన్నవించెను. వాసుకి ఆ బాలుని తనతో పాటు ఆదిశేషుని సన్నిధికి రమ్మని పిలువగ ధర్మనందనుడు "దేవా! నేనొక కిరాతునికిచ్చిన వచనమునకు బద్ధుడనైయున్నాను. సత్యవ్రతమునా దీక్ష. వచనబద్ధుడనైన నేను యిక్కడి నుండి కదలజాలను. నన్ను మన్నింపుడు." అని విన్నవించెను. ధర్మనందనుని సత్యనిష్ఠను జూచి వాసుకి హృదయము ఆనందముతో పరవశించినది. బాలుని ఆశీర్వదించి వాసుకి ఆదిశేషుని కొలువునకు చేరెను. యధావిధిని ఆదిశేషునకు నమస్కరించి ఆ ప్రభుని యాజ్ఞ గొని సముచితాసనముపై కూర్చుండెను. ఆ సభలో అన్నిలోకములలోని ధర్మవర్తనులైన మునుల మరియు రాజుల ప్రసంగములు, చర్చలు విశేషముగ జరిగినవి. అపుడు సర్పరాజైన వాసుకి సభామధ్యమన నిలచి "ఓ సభాసదులారా! సత్యసంధుడు, ధర్మనిరతుడునైనవాడు యిపుడీ లోకములో యెక్కడ వున్నాడు? వెదుకనవసరములేదు. సర్వాధిక సత్యవ్రతుడు, ధర్మనిష్ఠాగరిష్ఠుడునునైన ఒక వైశ్యబాలుడు, బ్రాహ్మణ సంరక్షణకై తన దేహమును బలి పెట్టుటకు నిశ్చయించుకొని, వచనబద్ధుడై యీ పాతాళ బిలద్వారముకడనే యున్నాడు. అతడు తన నుండి మాట తీసుకొనిన వ్యాధునికై నిరీక్షించుచు సత్యవ్రతమును పాలించుచున్నాడు." అని పలికెను. అంతట ఆదిశేషుడు జరిగిన ఉదంతమును దివ్యదృష్టితో తిలకించి ఆ విషయమును వాసుకికి తెల్పి, ధర్మనందనుని తన సన్నిధికి

తోడ్కొని రమ్మని ఆదేశించెను. వాసుకి వెంటనే ఆ బిలద్వారము యొద్దకు తిరిగివచ్చి ధ్యాననిమగ్నుడైన ధర్మనందనునితో "ఓ పుణ్యశీలా! నిన్ను సహస్రఫణిశోభితుడైన ఆదిశేషుడు చూడగోరుచున్నాడు. "ఓ కుమారా! ప్రజా శ్రేయోబిలాషియైన భద్రుడను రాజు వేటకై అడవికి వచ్చి, నీ నుండి వచనము గొన్న కిరాతకాపాలికుని సంహరించినాడు. కనుక నీవు నాతో వచ్చుట వలన వచనభంగముగాని, ధర్మహానిగాని కలుగనేరవు." అని నచ్చజెప్పి ధర్మనందనుని తనవెంట రసాతలమునకు గొనిపోయెను.

ఆ పాతాళమున ఆదిశేషుని సభయందు ప్రవేశించిన ధర్మనందనుడు నాగాధినాయకులచే సంస్తుతింపబడుచు కొలువుదీరియున్న సహస్ర ఫణీంద్రుని జూచి పులకిత దేహుడై వేవిధముల ఆయాదిశేషుని ప్రస్తుతించెను. అనంతుడు ఆ బాలుని సత్యనిష్ఠకును, ధర్మనిరతికిని మిక్కిలి సంతసించినవాడై, ఇష్టము వచ్చిన వరము కోరుకొనుమని అనుగ్రహించెను. ఆదిశేషుని యనుగ్రహమును పొందిన ధర్మనందనుడు అమితానందభరితుడై "ఓ జగదీశ్వరా! దయామయా! నాకు యుగకాలాదుల జ్ఞానమును, సృష్టిక్రమమును, సృష్టికి మూలమైన పరతత్త్వము యొక్క జ్ఞానమును మరియు మావంశోత్పత్తి చరిత్రను తెలియజేసి నన్ను కృతార్థునిగావింపుము." అని ప్రార్థించెను. ఆ బాలుని జ్ఞానజిజ్ఞాసను జూచి ఆనందించిన ఆదిశేషుడు వానిపై కరుణవహించి, యీ విధముగ చెప్పనారంభించెను.

## యుగకాలాదుల వివరణము :-

ఓ చిన్నవాడా! సమాహితచిత్తుడవై వినుము. కృతయుగమునకు పదియారు లక్షల యిరువది ఎనిమిదివేల సంవత్సరములు. త్రేతాయుగమునకు పన్నెండు లక్షల యెనుబది ఎనిమిదివేల సంవత్సరములు - ద్వాపరయుగమునకు ఎనిమిది లక్షల అఱువది నాలుగువేల సంవత్సరములు. కలియుగమునకు నాలుగు లక్షల ముప్పది రెండువేల

సంవత్సరములు అని కాలప్రమాణములు చెప్పబడినవి. ఈ నాలుగు యుగములు కలిసి మహా యుగమనబడుచున్నది. అట్టి మహాయుగములు డెబ్బదియొకటి కలిసి ఒక మన్వంతరమగును. ఆ మన్వంతరమే ఇంద్రకల్పమని కూడా పిలువబడు చున్నది. పదునాలుగు ఇంద్రకల్పములు గతించినచో బ్రహ్మకొక దినమగును. ఇట్టి పరిమితి గల నూరు సంవత్సరములు బ్రహ్మదేవుని ఆయుర్దాయ పరిమితి. అదియే బ్రహ్మకల్పమనబడుచున్నది. నూరు బ్రహ్మకల్పములు గతించినచో దీర్ఘాయువను మునీంద్రునకొక దినమగును. ఇరువది యేడుకోట్ల దీర్ఘాయుమునీంద్రులు గతించినచో రోమశాఖ్యమౌని యొక్క ఒక రోమము ఊడిపోవును. ముప్పదికోట్ల రోమశాఖ్యమును లంతరించినచో అష్టావక్రముని యొక్క ఎముక యొకటి జీర్ణించును. అష్టావక్రమునులు నలువదికోట్లు గతించినచో పాదద్రుజ్మునికి క్షణకాలమగును. అట్టి పాదద్రుజ్మునులు ఇరువది యర్బుదముల కోట్లమంది గతించినచో, అనంతకాల స్వరూపిణియైన ఆదిశక్తియౌ మహకాళికి నిమిషకాలముకన్న తక్కువ యగునని మహర్షులు చెప్పిరి. ఆదిశక్తి అనంతకాల స్వరూపిణి. కాలస్వరూపమైన ఆ పరాశక్తినే మహాకాళి అనినారు పెద్దలు. సమస్తము కాలమునందే లయమగును గాన మహాకాళిని లయకారిణి అనినారు. అనంతకాలము యొక్కపరిమితిని ఎవ్వరునూ గణించలేరు. అట్టి కాలముయొక్కఅనంత తత్త్వమును గూర్చి ఒక భావన కలిగించుటకై పైన చెప్పి దీర్ఘాయువు, రోమశాఖ్యముని, అష్టావక్రముని, పాదద్రుజ్మని మున్నగు వారలని కల్పించి వారి ఆయుః ప్రమాణములను తమ మేధాశక్తిచే వూహించి మహర్షులు చెప్పుట జరిగినది. పైగా ఇట్టి ఊహాతీతమైన మొత్తము కాలము ఆదిశక్తియైన మహకాళికి నిమిష కాలముకంటే తక్కువయగునని చెప్పి కాలము అనంతమగు అవగాహన కల్పించబడినది.

వత్సా! ధర్మనందనా! అనంతమగు కాలమే పరమాత్మ స్వరూపము. కాలము యొక్క మహత్వము వర్ణనాతీతము. పోయిన ధనమును, ఆరోగ్యమును, విద్యను,

రాజ్యమును, తుదకు ప్రాణమునైనను తిరిగి పొందవచ్చును గాని గడిచిపోయిన యొక క్షణకాలమునైనను తిరిగి సంపాదించజాలము. గతించిన కాలమును తిరిగితెచ్చుట అసంభవము. కాలమత్యంతవేగము గలది. "కాలో అశ్వోవహితి – కాలమను అశ్వము పరిగెత్తుచున్నది" అని అధర్వణ వేదము పలికినది. గడిచిపోవుచున్న ఒక్కొక్కక్షణమందు కుబేర సంపత్తిదాగియున్నదను సత్యమును గ్రహించవలెనని పెద్దలు బోధించిరి. కనుక సమయ సంపద యొక్క మహత్త్వము నెరిగి దానిని సదుపయోగపరచుకొను వాడు కాలస్వరూపిణియైన మహాకాళికృపకు పాత్రుడై జీవనమును సార్థక మొనర్చుకొని సామ్రాజ్యమును పొందగలరు. దైవ స్వరూపమగు కాలమును వ్యర్థము చేసుకొనువాడు వ్యర్థజీవనుడైనశించును. అయ్యాదిశక్తి యొక్కతత్వమును గూర్చి యొకింత వినుము.

శ్లో॥ సావై సర్వస్య జగతః అద్యస్స్రష్టాహి రక్షితా ।
అంతస్సర్వగతా సూక్ష్మాశక్తిర్నిత్యామహేశ్వరీ ॥
ఆధారా జగతస్సేవ్యాసాక్షీసర్వసురాధిపా ।
సహీశేషశ్చ విశ్వేశి బహుబాహూర్బహౌదరా ॥
ఆగమానాంచ సర్వేసావేదానా మప్యగోచరా ॥
శ్రుణోత్యకర్ణా-పిసమస్త మేతత్పశ్యన్న చక్షుః ర్బహిరంతరశ్చ ।
భవత్య పాదా-పిచసర్వగామీనీ దదాత్య హస్తస్వయ మాద దాతి ॥
స్వయం నిమిత్తం జగతః ఉపాదానంచ కారణమ్ ।
అంతర్ముఖైరీక్ష్యతే సా దహరాకాశ నిష్ఠితా ॥

అనంత కాలరూపిణియైన మహాకాళియగు ఆదిశక్తియే బహిరంతములలో వ్యాపించియున్న సర్వాంతర్యామిని, ఆ శక్తియే సూక్ష్మయై, నిత్యయై, సర్వజగత్సృష్టికి ఆదియై, రక్షకియై, సమస్తమునకాధారమై, సర్వసాక్షియై, సకల విశ్వ సంసేవ్యయై, సమస్త

దేవదేవేశియై, విరాజిల్లు పరాశక్తి, ఆమెయే అనేక బహూదర వక్త్రనేత్రములు గలదై, ఆగనిగమాతీతవేదినియై, అఖిల సృష్టిస్థితి లయకారిణియై, అంతర్ముఖులైన యోగివరుల హృదయాకాశములయందు వారిచే చూడబడు పరమేశ్వరి, జగత్తులు లయము పొందినను, బ్రహ్మాదులంతరించినను, సమస్త సముద్రములేకమైనను, విశ్వమందంతటను అంధకార మావహించి, తమః స్వరూపమున గుణసామ్యము పొందినను, పరంజ్యోతియైన ఆ పరాశక్తి ఎల్లెడల వ్యాపించు మహాతేజస్సుతో విరాజిల్లుచుండును. ఈ శక్తి తన చేత కల్పించబడిన మహతో మహతత్వమును సృష్టించినది. అనంతరము ప్రసిద్ధమైన మహదహంకారమును సృష్టించినది. అటుపై అహంకారమున తమస్సు, రజస్సు, సత్వములను సృష్టించినది. తానే తన అలౌకిక మాయాశక్తితో తమోగుణ ప్రధానుడైన ఈశ్వరుని, రజోగుణప్రధానుడైన బ్రహ్మను, సత్వగుణ ప్రధానుడైన విష్ణువును ప్రభవింపజేసినది. అంతట ఆ పరాశక్తి బ్రహ్మకు నాలుగు వేదములను, జగత్సృష్టియందు నేర్పరితనమును ప్రసాదించినది. విష్ణువునకు లోకరక్షణమునకై చక్రాయుధమును నొసంగినది. ఈశ్వరునకు జగత్సంహారక శక్తిని త్రిశూలమును యిచ్చి సంతుష్టాంతరంగయైనది.

"వత్సా! ధర్మనందనా! ఆ దేవీ మహత్వము బ్రహ్మాదులకే పూర్ణముగ అవగతము కానిది. సహస్రశీర్షుడనైన నాకు గూడ వర్ణింపనలవికానిది" అని ఆదిశేషుడు చెప్పగ ధర్మనందునుడు మిక్కిలి ఆసక్తితో గూడినవాడై అనంతునకు పదే పదే ప్రణమిల్లుచు "ఓ దేవదేవా! అనంతా! ఆ పరాశక్తియొక్క మహత్వము చక్కగ దెలియజేయుటకు నీవొక్కడవే సమర్థుడవు. నాపై కరుణవహించి నాకా పరాశక్తి యొక్క మహత్వమును, ఆ జగన్మాత దివ్య గాథలను తెలియజెప్పుము." అని ప్రార్థించెను. అపుడాదిశేషుడు కరుణాంతరంగుడై "నాయనా ధర్మనందనా! పూర్వమొకప్పుడు సాక్షాత్తు ఆదిపరాశక్తియే ఇంద్రునకు తన

నిజతత్త్వమును గురించి వివరించి చెప్పినది. ఆ దివ్యగాధను, మరియు దేవియే స్వయముగ చెప్పిన ఆ తత్త్వ రహస్యమును సావధానుడవై వినుము. నీకు నిస్సందేహమైన జ్ఞానము కలుగును.

## ఆదిపరాశక్తి మహత్వము :

పూర్వము మదగర్వితులైన రాక్షసులు దేవతలతో యుద్ధము చేసిరి. పరాశక్తి యొక్క కరుణాకటాక్ష లేశ ప్రభావముతో దేవతలు జయించిరి. ఓడిపోయిన దానవులు స్వర్గమర్త్య లోకములను విడిచి పాతాళమునకు పారిపోయిరి. విజయ గర్వముతో విఱ్ఱవీగిన దేవతలు మోహవశులై తమ తమ పరాక్రమముల నభివర్ణించుకొనుచు, పరాశక్తి ప్రభావమును విస్మరించి, సృజన, పాలన, లయములకు కూడ తామేకర్తలమనియు, తమకన్న మహిమాన్వితులైన వారు వేరెవ్వరును లేరనియు ప్రగల్భములు పలికిరి. పరాశక్తి వారి గర్వమును తొలగించి వారిని కరుణించవలెనను సంకల్పముతో ఆ దేవతల ముందు తేజోమయమగు యక్షరూపమున ప్రత్యక్షమయ్యెను. కోటి చంద్రులు ఒక్కమారు ఉదయించినపుడు విలసిల్లు చల్లని కరుణాకటాక్షమాలికా విన్యాసముతో, కోటిసూర్యుల మహాతేజముతో, కోటి మెరుపుతీగల ప్రకాశమునకు సమానమైన వెలుగుతో ప్రకాశించుచున్న ఒక అపూర్వ మహాతేజఃపుంజమును తమ ఎదుట తిలకించి దేవతలు ఆశ్చర్యచకితులైరి. అందరును ఒకచోట చేరి దాని తత్త్వమును గూర్చి విచారణ చేయసాగిరి. చివరకు ఆ యక్షశక్తినే సమీపించి అదియేమని ఆ శక్తినే ప్రశ్నించుట యుక్తమని నిర్ణయించిరి. సర్వేశ్వరుడైన ఇంద్రుడు అగ్నిని బిలిచి “ఓ అగ్నిదేవా! మాకు ముఖ స్థానములో వెలుగొందువాడవు నీవే గనుక, నీవు పోయి ఆ అద్భుత ప్రకాశతత్త్వమును తెలుసుకొనిరమ్ము.” అని ఆదేశించెను. దేవతలలో తానే అగ్రగణ్యుడనని భావించిన అగ్ని వేగముగ ఆ తేజో మూర్తి ఎదుటకు పోయి నిలచెను. తన

ఎదుట నిలచిన అగ్నిని చూచి ఆ జ్యోతి స్వరూపిణి "నీవెవడవు? నీకు గల శక్తి ఎట్టిదో తెల్పుము" అని ప్రశ్నించినది. అంతట అగ్ని "నేను జాతవేదసుడను. లోకములో దేనినైనను కాల్చి భస్మము చేయగల శక్తివంతుడను" అని బదులు పలికెను. అంత ఆ పరంతేజము ఒక తృణమును (గడ్డిపోచను) ఆ అగ్నిముందు బడవేసి, లోకములను కాల్చుశక్తి నీకున్న యెడల యా తృణమును కాల్చుమని అడిగెను. హుతాశనుడు తన శక్తినంతటిని వినియోగించి కూడ, ఆ గడ్డిపోచను కాల్చజాలక సిగ్గుతో సురలచెంతకు వెడలిపోయెను. అగ్నిదేవుని భంగపాటు గూర్చి విన్న ఇంద్రుడు వాయుదేవుని పిలిచి "ఓ వాయుదేవా! నీవు లోకమంతటను నిండియున్నావు. నీవల్లనే సృష్టి ప్రాణవంతమగుచున్నది. జీవులకు ప్రాణములై వారిశక్తులను ధారణ చేయుచున్నావు. తెలియరాని తత్త్వముతో ప్రకాశించుచున్న ఆ మహాతేజము యొక్క సత్యమును తెలుసుకొనుటకు నీవే సమర్థుడవు. నీవుపోయి ఆ తేజో రహస్యమును తెలుసుకొనిరమ్ము." అని ఆదేశించెను. ఇంద్రుని మాటవిని వాయువు ఆ తేజో మూర్తి వద్దకు వెళ్ళి తనను గూర్చియు, తన శక్తిని గూర్చియు తెలియజెప్పెను. అంత ఆ జ్యోతి స్వరూపము యథాపూర్వము వాయువు ముందు తృణమును వుంచి, దానిని కదల్చమని అడిగినది. కాని వాయుదేవుడా గడ్డిపోచను యిసుమంతైనను కదల్చలేక సిగ్గుపడి దేవతల యొద్దకు వెడలిపోయెను. మిగిలిన దేవతలందరును తమ మిథ్యాగర్వము తెలుసుకొన్నవారై, ఆ ప్రకాశరూపమైన యక్షకడకు వెళ్లుటకు సాహసించలేక పోయిరి. తుదకు ఇంద్రుడే ఆ యక్షను చూడబోయెను. కాని ఆ యక్షరూపము అతనికి కనిపించలేదు. ఇంద్రుడు తనకు కలిగిన పరాభవమునకు మిక్కిలి చింతించెను. జరిగిన అద్భుతకృత్యము పరాశక్తి లీలావిలాసమని తుదకు గ్రహించి ఆ జ్యోతీతత్త్వమను మనసా శరణు వేడుకొనెను. అపుడా ఆకాశము నుండి "ఓ ఇంద్రా మాయాబీజమును జపించుము" అని అశరీరవాణి వినిపించింది. ఇంద్రుడు సుదీర్ఘకాలము మాయాబీజ జపధ్యాన నిమగ్నుడయ్యెను. చివరకు చైత్ర

మాసములో నవమి తిధినాడు ఆ మహాతేజము తిరిగి ఆవిర్భవించినది. ఆ తేజోమండల మధ్యమున నవయవ్వనవతియైన ఒక కుమారిని ఇంద్రుడు దర్శించెను. ఆ కన్య జపాకుసుమమువంటి ఎర్రని శరీరకాంతితో, అపుడే ఉదయించుచున్న కోటిసూర్యుల ప్రకాశముతో, బాలచంద్రుడు శిరోమకుటముపై ఆభూషణమై అలరారుచుండుగ, పాశాంకుశ వరదాభయ ముద్రలను దాల్చిన చతుర్భుజములతో సర్వాధిక సుందరియై, భక్తజనకల్పవల్లియై, సర్వాలంకారశోభితయై, త్రినేత్రయై, భువనేశ్వరియై దర్శనమిచ్చినది. మూడు కన్నులతోనున్న ఆ ముగ్గురమ్మల మూలపుటమ్మను చూచిన ఇంద్రుని సహస్రనేత్రములనుండి ఆనందాశ్రువులు జాలువారినవి. అంత నాతడు ఆ జగదీశ్వరీ పాదపద్మములకు సాష్టాంగ దండ ప్రణామము లాచరించి "ఓ శోభనరూపిణీ! నీ తత్వమేమిటో తెల్పుము" అని ఆయమ్మను ప్రార్థించెను.

## ఆదిశక్తి తత్త్వ దర్శనము :

అంత ఆ పరాశక్తి ఇంద్రునిపై కరుణవహించి "ఓ సురరాజా! సావధానుడవై వినుము. సంపూర్ణ కారణములకు కారణభూతుడైన బ్రహ్మమునా రూపమే. అది సర్వసాక్షి. నిరామయము. సమస్త వేదములు ఏ పదమును చెప్పుచున్నవో, సమస్త తాపసులకేది ధ్యేయమైయున్నదో, దేనిని పొందవలెనను అభిలాషతో యోగులు, మహర్షి గణములు, బ్రహ్మచర్యాది కఠినాచరణములను పాలించుచున్నారో ఆ అభీప్సిత పదమును సంక్షిప్తముగ తెలియజేయుచున్నాను. "ఓమ్" అను యీ ఏకాక్షరము నిత్యబ్రహ్మమైయున్నది. ఇదే "హ్రీం" మాయా స్వరూపమైయున్నది. ముఖ్యముగ "ఓమ్ మరియు హ్రీం" నా మంత్రమునకు ప్రధానబీజములై యున్నవి. నేను వీనితో సంపూర్ణ ప్రపంచమును నిర్మించుచున్నాను. పరాపరప్రకృతి రూపిణినైన నేనే సచ్చిదానంద

నామకురాలనై యున్నాను. మాయ, ప్రకృతి అనునామములు నా యందే కల్పింపబడినవి. ఆ మాయను, పరాశక్తిని, శక్తిమతియగు పరమేశ్వరిని నేనే.

చంద్రుని నుండి వెన్నెల వేరుగానట్లు నా మాయ నాకు వేరు గాదు. నాయీ మాయ సామ్యావస్థగలది. కల్ప ప్రళయము జరిగినపుడు నాచే సృష్టించబడిన యీ ప్రపంచమంతయు నాయందేలీనమగును. మరల ప్రాణుల కర్మపరిపాకవశమున సృష్టి జరుగుచుండును. నా రూపములు సగుణము, నిర్గుణములను రెండు విధములు. నిర్గుణము మాయారహితమైనది. సగుణము మాయాసహితమైనది. నేను ఎల్ల జగత్తులను సృజించి వానియందు ప్రవేశించి వారి వారి కర్మలకనుగుణముగ జీవులను నిరంతరము ప్రేరేపింతును. నేను మిమ్ములను కొయ్యబొమ్మలవలె ఆడించు ఆదిశక్తిని. అట్టి సర్వాత్మికనైన నన్ను మీరు గర్వముచే మరచి మోహగ్రస్తులైనారు. మిమ్ములను అనుగ్రహించుటకే నా యక్షరూపతేజము ఆవిర్భవించినది. మీరిక దేహాభిమాన గర్వములను విడచి నన్ను శరణుపొంది ధన్యులు కండు" అని ఆదిపరాశక్తి ఇంద్రునకు తన నిజతత్త్వమును గూర్చి తెలియజేసినది.

ఇట్లు ఆదిశేషునిచే ధర్మనందనునకు చెప్పబడిన దేవితత్త్వ దర్శనమును సూతుడు నాడు శౌనకాది మహామునులకు తెలియజేసెను. ఆ పరమ పవిత్ర విషయములనే మీ కిప్పుడు నేను విశదపరచితిని అని సాలంకాయన మౌని మణిగుప్తాదులుకు యెరుకపరచి "నాయనలారా! మీకొక విశిష్ట విషయమును తెలుపుచున్నాను. యక్షగణాధిపతియగు కుబేరుని అంశారూపులై విరాజిల్లుచు, కుబేరాంశజులని పేరొందిన మీ వంశీయులు ఆదినుండియు పరాశక్తికి ప్రియభక్తులు. పరాశక్తియింద్రాది దేవతలకు తేజో మయమైన యక్షరూపమున ప్రత్యక్షమైనదనిన విషయము దేవీ భాగవతమందు సుస్పష్టముగ

తెలియజేయ బడినది. ఈ ఉదంతము పరాశక్తికిని మీ వైశ్యవర్ణమునకును గల అవినాభావ సంబంధమును తెలియజేయుచున్నది గదా, ఓ వైశ్యోత్తములారా! పరాంబికా పరాభక్తి విలసితమగు మీ వైశ్యవర్ణము మిక్కిలి ధన్యము.

ఆ దేవి తత్త్వ మహత్త్వములను వినువారు, పఠించువారు ధన్యులై మోక్ష మార్గమును పొందగలరు. ఇది నిశ్చయము."